క్లుప్తంగా

పిల్లల ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



భట్టిప్రోలు: న్యూ లైఫ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్య శాల (తెనాలి) ఆధ్వర్యంలో ఆదివారం వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి ప్రారంభించారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు రాధిక రాజశేఖర్ కుప్పా, కేటీఎస్ శ్రీనివాస రావు, గారపాటి అఖిల్ పాల్గొని వైద్య సేవలు అదించారు. ఈ శిబిరంలో 96 మంది చిన్నారులను పరీక్షించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ కుప్పా పర్యవేక్షించారు.

చీరల బహిరంగ వేలం.. రూ.43,350 ఆదాయం



పిట్టలవానిపాలెం: చందోలులోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో భక్తులు అమ్మవారికి కానుకలు, మొక్కుబడులు రూపంలో సమర్పించిన చీరల బహిరంగ వేలం ఆదివారం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింమమూర్తి మాట్లాడుతూ 219 చీరలు వేలం నిర్వహించగా రూ.43,350లు ఆదాయం లభించినట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, దేవదాయ బాపట్ల ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



కొల్లూరు : గంధ మహోత్సవాలను కొల్లూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజస్థాన్‌లో వెలసిన అజ్మీర్ షరీఫ్ హజరత్ ఖాజ్వా గరీబ్ నవాజ్ రహమతుల్లాలహి పేరిట అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. స్థానిక జెండా చెట్టు వద్ద ప్రత్యేకంగా అలంకరించిన జెండాను పూల శాధర్‌లతో కొల్లూరు ప్రధాన వీధుల్లో ఊరేగించారు. జెండా చెట్టు వద్ద ప్రతిష్ఠించారు. జెండా ఊరేగింపు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. హిందువులు, ముస్లింలు పాల్గొని, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

'సెంటినరీ బాప్టిస్ట్' నూతన కమిటీ ఎంపిక



బాపట్ల: పట్టణంలోని సెంటినరీ బాప్టిస్ట్ సీయోను దేవాలయం నూతన కమిటీ ఎంపిక ఆదివారం నిర్వహించారు. 2024–25సంవత్సరానికి ఈ కమిటీ ఉంటుందని నూతన కమిటీ సెక్రటరీ జె.క్రిష్టఫర్ తెలిపారు. జాయింట్ సెక్రటరీగా జి.ఎలీషా రావు, ట్రెజరర్‌గా ఎ.ప్రసన్న కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. స్త్రీల సమాజ నూతన కమిటీ సెక్రటరీగా డి. సుకన్య దేవి, జాయింట్ సెక్రెటరీగా టి. కమల లత, ట్రెజరర్‌గా సీహెచ్. జాస్మిన్‌ను ఎన్నుకున్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాపట్ల: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రాజోలి శ్రీనివాసరావుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, ఎన్జీఆర్ క్లబ్ రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందించింది. సేవా సంస్థ కోశాధికారి వంకాయలపాటి హరిబాబు, మానవత సంస్థ బాపట్ల అధ్యక్షుడు డాక్టరు శరత్‌బోస్, పి.సి.సాయిబాబు, తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యవర్గ నిర్ణయం మేరకు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. నరసింహారెడ్డి, కె.కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పాలన

వేమూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

కూచిపూడి(వేమూరు): సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండలం కూచిపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయి నాయకత్వం బలపరిచేవిధంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. దీంతో పార్టీ పటిష్టంగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని వరికూటి స్పష్టం చేశారు. బూత్ కమిటీ ఏజెంట్లు గెలుపులో కీలకంగా ఉన్నందున వారికి ప్రాధాన్యం కల్పించడం జరుగుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు పెత్తందారి వ్యవస్థకు కొమ్ముకాశారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం కులం, మతం, రాజకీయ భేదాలు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, జెడ్పీటీసీ మూల్పూరు లావణ్య, పార్టీ మండలాధ్యక్షుడు యలవర్తి సురేష్, గ్రామ సర్పంచ్‌లు కొండమూది శ్యామల, రమాదేవి, మండే నాగేశ్వరరావు, దేవర కొండ రాము, వైస్ ఎంపీపీ కూచిపూడి శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్, కోళ్లమూడి అశోక్, మోదుకూరి హరిబాబు, నియోజక వర్గం సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

పసుపు రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న పసుపు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

తెనాలిఅర్బన్: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు యాజమాన్యం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని పసుపు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. తెనాలి గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో సుమారు 1.15 లక్షల పసుపు బస్తాలు అహుతయ్యాయని తెలిపారు. పసుపు రైతులు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ సోమవారం ఉదయం 10గంటలకు దుగ్గిరాలలోని పసుపు యార్డులో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరు పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా రైతు సంఘం నాయకులు జవాది సాంబశివరావు, యార్లగడ్డ శివయ్య, బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద ర్యాంప్‌ల ఏర్పాటు

యుద్ధప్రాతిపదికన నిర్మాణం



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూలులో పోలింగ్ బూత్‌ల వద్ద నిర్మిస్తున్న ర్యాంప్‌లు

ప్రత్తిపాడు: ఎన్నికలకు యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగం తుది ఓటర్ల జాబితాను అధికారులు ప్రకటించారు. వివిధ శాఖల్లో అధికారుల బదిలీల ప్రక్రియ కూడా మొదలయ్యింది. ఈ నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. ప్రత్యేక అవసరాలు గల ఓటర్లు ఇబ్బందులు పడకుండా ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీంతో ఆయా మండలాల్లోని తహసీల్దార్లు, ఎంఈవోలు, బీఎల్‌వోలు ర్యాంప్‌లు లేని పోలింగ్ కేంద్రాల్ని గుర్తించి, యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నారు. నియోకవర్గంలోని ప్రత్తిపాడు మండలంలో 47 బూత్‌లు, పెదనందిపాడు మండలంలో 41, వట్టిచెరుకూరు మండలంలో 45, కాకుమాను మండలంలో 42, గుంటూరు రూరల్ మండలంలో 110 చొప్పున 285 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. గతంలో 245 ఉన్న పోలింగ్‌బూత్‌ల సంఖ్య గత ఎన్నికల సమయంలో జరిగిన మార్పులు చేర్పుల్లో 283కు పెరిగింది. ఇటీవల జరిగిన స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో జరిగిన మార్పులతో 285కు చేరింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 212గా ఉన్న ప్రత్తిపాడు నియోజకవర్గం సంఖ్య, రాష్ట్ర విభజన అనంతరం 93 గా మారిన సంగతి తెలిసిందే !

నేడు 'స్పందన' కార్యక్రమం

రేపల్లె రూరల్: పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీవో హేలా షారోన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

అద్దేపల్లిలో గీతాజ్ఞాన కర్పూర యజ్ఞం

అద్దేపల్లి(భట్టిప్రోలు): అద్దేపల్లిలోని శ్రీ రామ నామ క్షేత్రంలో ఆదివారం గీతాజ్ఞాన కర్పూర యజ్ఞం వైభవంగా జరిగింది. సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం ఆర్గనైజర్ బూర్లె అరుణకుమారి ఆధ్వర్యంలో ఈ యజ్ఞం జరిగింది. శ్రీ మల్లేశ్వర, శ్రీ వేంకటేశ్వర, జై మార్కండేయ భజన సమాజం ఆర్గనైజర్లు కొతరపు గోపాల కృష్ణయ్య, ఆత్మూరి మురళీ సూర్య ప్రకాశరావు, వంగర వీరాంజనేయులు ఆధ్వర్యంలో సాయంత్రం 6 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు అర్ధ ఏకాహం జరిగింది. రాత్రి సమారాధన జరిగింది. కార్యక్రమాలను సంఘ అధ్యక్షులు కొన్నిపాటి భాస్కరరావు, సహాయ కార్యదర్శి కాగిత ఆంజనేయులు, కార్యదర్శి కాగిత దుర్గాప్రసాద్, డైరెక్టర్లు పర్యవేక్షించారు.

సరదాగా.. సందడిగా



ఆట వస్తువుల వద్ద చిన్నారుల సందడి



చిన్నారులను ఆడిస్తున్న తల్లిదండ్రులు

రేపల్లె రూరల్: పట్టణంలో ఇటీవల ఆధునీకరించిన అంబేడ్కర్ ఉద్యాన వనం ప్రజలకు ఆహ్లాదంగా మారింది. ఆదివారం సాయంత్రం చిన్నారులు సందడి చేశారు. తొమ్మిదవ వార్డులోని ఈ ఉద్యాన వనాన్ని మున్సిపల్ సాధారణ నిధులు రూ.20 లక్షలతో ఇటీవల అధికారులు సుందరంగా తీర్చిదిద్దారు. సెలవు దినం కావడంతో.. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలతో ఇక్కడికి వచ్చి, సరదాగా గడిపారు. పార్కులోని ఆట వస్తువులతో ఆడుకున్నారు.

నవజాత శిశు సంరక్షణ కేంద్రం 'వెల్ బేబీ' ప్రారంభం



ప్రారంభిస్తున్న డాక్టర్లు బాబూరావు, మధుసూదనరావు

పాత గుంటూరు: కొత్తపేటలోని కనుమూరి హాస్పిటల్‌లో నవజాత శిశువుల ప్రత్యేక సంరక్షణకు నియోనేటల్ సెంటర్ వెల్ బేబీని ఆదివారం ప్రముఖ వైద్యులు డాక్టర్. జి. బాబూరావు, డాక్టర్. యం. మధుసూదనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోనేటాలజీ నిపుణులు డాక్టర్ ఏ.వి.ఎస్.రాజు మాట్లాడుతూ నెలలు నిండకుండా పుట్టి అతి తక్కువ బరువు కలిగి ఉన్న శిశువుల వైద్యానికి సంబంధించి అత్యాధునికమైన పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుంటూరులో ప్రథమంగా వెంటిలేటర్‌పై ఉన్న ఆక్సిజన్ అందని నవజాత శిశువులకు ఇనిహేల్డ్ నైట్రిక్ ఆక్సైడ్ పరికరం అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఇంకుబేటర్ ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్ లాంటి అధునాతన పరికరాలు కలిగిన అంబులెన్స్‌ను కూడా సమకూర్చామని వివరించారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ నెలలు నిండని నవజాత శిశువుల్లో శ్వాసకోశ వ్యాధులు, నిర్ధారణ, చికిత్సకు అవసరమైన నియోనేటర్ బ్రాంకోస్కోపి గుంటూరులోనే మొదటిసారిగా సమకూర్చుకున్నట్లు తెలిపారు. యూనిట్‌లో 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పలువురు వైద్యులు డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావుకు డాక్టర్ రాజు, డాక్టర్ ప్రియాంకకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ పి.ఏడుకొండలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.50 వేల విరాళం

తెనాలి: వాకర్స్ క్లబ్ అభివృద్ధి కోసం క్లబ్ సభ్యుడు దొడ్డపనేని అచ్చయ్య ప్రకటించిన రూ.50 వేల విరాళాన్ని క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నకు ఆదివారం అందజేశారు. దొడ్డపనేని అచ్చయ్య సేవ, వితరణ దృక్పథాన్ని వెంకటరత్నం అభినందించారు. క్లబ్ సభ్యులు రత్తయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో 1987–1988 విద్యా సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 175 మందిలో 15 మంది పరమపదించగా 165 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. తరగతి గదుల్లో చేసిన అల్లరిని గుర్తుచేసకున్నారు. అప్పటి గురువులను పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమను తాము మరచిపోయి ఆటపాటలతో సంతోషంగా గడిపారు. అనంతరం మిత్రులందరికి వీడ్కోలు పలుకుతూ బరువెక్కిన హృదయాలతో అడుగులు వేశారు.

నేడు స్ఫూర్తి ది ఐక్యూబ్ ఎక్స్‌పో ప్రారంభోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం స్ఫూర్తి–ది ఐక్యూబ్ ఎక్స్‌పో ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్ని పరిశ్రమల అవసరాలకు దీటుగా తయారు చేసేందుకు విద్యాసంస్థలు, వైద్యశాలలు, పరిశ్రమల కలయికగా ఎక్స్‌పో ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 3.00 గంటలకు జరగనున్న ప్రారంభోత్సవానికి మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ దేసు రామమోహన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. మంగళ, బుధ వారాల్లో జరగనున్న ఎక్స్‌పోలో వివిధ డిగ్రీ కళాశాలలు, ఆస్పత్రులు, పరిశ్రమలు పాల్గొనను న్నాయని రమణ వివరించారు.

నేడు పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం

తెనాలిరూరల్: ది తెనాలి యునైటెడ్ పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ జనవరి నెల సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇస్లాంపేటలోని కృష్ణబలిజ కమ్యూనిటీ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ పినపాటి జాన్‌పాల్ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. అసోసియేషన్ నాయకులు, పట్టణంలోని పాస్టర్లందరూ పాల్గొనాలని బ్రదర్ ఆనంద్ కోరారు.

పేదలకు అండగా వైఎస్సార్ సీపీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కోన రమాదేవి

బాపట్ల: పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి సతీమణి రమాదేవి పేర్కొన్నారు. కోన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మురుకొండపాడు, కంకటపాలెం గ్రామాల్లో పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ నవరత్నాలతో పేదలను ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. పెన్షనర్లకు ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దనే పెన్షన్లు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కె.రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, కటికల యోహోవా తదితరులు ఉన్నారు.

సందడిగా పుస్తకాల ఆవిష్కరణ



పాత గుంటూరు: నగరంపాలెంలోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి వైశ్య హాస్టల్ సమావేశ మందిరంలో ఆదివారం బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రుల అభిమాన రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన, రాయలసీమ తొలితరం నవల ఎం.వి. పాపన్న గుప్త రచించిన 'భానుమతి' పునర్ ముద్రణ పుస్తకాలను ఆవిష్కరించారు. ఆకాశవాణి పూర్వ సంచాలకులు, సులోచనారాణి సాహిత్య వివేచన గ్రంథ సంపాదకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సభకు అధ్యక్షత వహించారు. సాహితీ పోషకులు బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి గ్రంథాల్ని ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత్రి సరోజినీ ప్రేమ్‌చంద్ యద్దనపూడి సులోచనారాణితో ఉన్న అనుబంధం, ఆమె సాహిత్య రచనలపై చేసిన సోదాహరణ ప్రసంగం ఆకట్టుకుంది. ప్రముఖ నాటక రచయిత, 2023 రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు గ్రహీత పిన్నమనేని మృత్యుంజయరావు భానుమతి నవలను విశ్లేషించారు. కార్యక్రమాన్ని సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ పర్యవేక్షించారు. ప్రముఖ రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

లైబ్రరియన్స్‌కి పదోన్నతి కల్పించాలి

నెహ్రూనగర్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న పీడీ, లైబ్రరియన్స్‌కు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలని ఇంటర్ ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ నాయకులు, లైబ్రేరి సైన్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్. రమేష్‌బాబు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడీ, లైబ్రేరియన్స్‌కు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ 2021లో జీవో నం.76ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. దాన్ని అమలు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవోను అమలు చేయాలని ఆయన కోరారు.

ఘనంగా 'తెలుగు కావ్య మథనం' వార్షికోత్సవం



పూసపాటి దంపతులకు సత్కారం

పాత గుంటూరు: బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయం వేదికగా ఆదివారం తెలుగు కావ్య మథనం సంస్థ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. సభకు సంస్థ వ్యవస్థాపకులు పూసపాటి కృష్ణ సూర్యకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. తెలుగు పద్యంపై అభిమానంతో 2019 నుంచి వాట్సాప్ గ్రూప్ ద్వారా అనేక మంది తెలుగు ఉపాధ్యాయులకు పద్యాల్ని ఉచితంగా నేర్పిస్తున్నట్లు తెలిపారు. పద్య రచనను క్రమబద్ధంగా నేర్పించడమే లక్ష్యం అన్నారు. అతిథులు ఏ. భానుప్రకాష్, ఎన్.సీహెచ్. చక్రవర్తి, చిటితోటి విజయకుమార్, కంది శంకరయ్య ప్రసంగించారు. జయకర్ విశ్వేశ్వర్ కావ్య మథన సమూహ పరిచయం చేశారు. కంది శంకరయ్యకు సమస్యేంద్ర జాలిక బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పూసపాటి దంపతులను విద్యార్థులు, గురువులు ఘనంగా సత్కరించారు. ఘనమైన తెలుగు పద్యం కనుమరుగు కాకూడదనే ఉచితంగా బోధన చేస్తున్నట్లు పూసపాటి దంపతులు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం



పట్నంబజారు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని నగరంపాలెం పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో డి. నరేష్‌కుమార్ చెప్పారు. స్థానిక ఏటీ అగ్రహారంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రణవ పీఠం సభ్యుల ఆధ్వర్యంలో గుడిబడి సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రణవపీఠం సభ్యులంతా ఆలయంతో పాటు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగరంపాలెం పీఎస్ ఎస్‌హెచ్‌వో నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఆలయాలను శుభ్రపరిచే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో పాటు పుణ్య కార్యక్రమాల్ని చేపట్టడం అభినందనీయమని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాల ద్వారా భావితరాలకు కూడా సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి అలవర్చిన వారమవుతామని చెప్పారు. కార్యక్రమంలో ప్రణవ పీఠం సభ్యులు పాల్గొన్నారు.

మహిళలను దూషించిన ఘటనపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో సివిల్ కాంట్రాక్టర్ ఇంటికి వెళ్లి ఇద్దరు వ్యక్తులు మహిళలను దూషించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కె.మహేశ్వరరెడ్డి సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ప్రశాంత్, అతని తండ్రి వెంకటేశ్వర్లు మహేశ్వరరెడ్డి వద్ద లేబర్ వర్క్ చేశారు. ఈ నేపథ్యంలో వారి మధ్య లావాదేవీల విషయంలో గొడవ జరిగింది. ప్రశాంత్, వెంకటేశ్వర్లు మహేశ్వరరెడ్డికి ఫోన్ చేసి దుర్భాషలాడారు. పైగా మహేశ్వరరెడ్డి ఇంటికి వెళ్లి మహిళలను అసభ్యకరంగా దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుప్పట్లు పంపిణీ



పెదగొల్లపాలెంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ సినీ రచయిత కోన వెంకట్

కర్లపాలెం: సినీ రచయిత, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన వెంకట్ పేరలిపాడు, పెదగొల్లపాలెం గ్రామ పంచాయతీల పరిధిలో వైఎస్సార్ పింఛన్ల లబ్ధిదారులకు కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, సర్పంచ్‌లు యల్లావుల సురేష్, కాగిత కరుణకుమారి, నాదెండ్ల భానుప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

వాసవి కుటుంబ సురక్ష సాయం పంపిణీ



తెనాలి: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ 217ఏ జిల్లా పరిధిలోని 60 మంది వాసవి కుటుంబ సురక్ష లబ్ధిదారులకు రూ.30 లక్షలను ఆదివారం అందజేశారు. దివంగతులైన క్లబ్ సభ్యుల కుటుంబాలకు రెండో విడతగా ఈ ఆర్థిక సాయాన్ని క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గోనుగుంట్ల జయంత్ కుమార్ అందజేశారు. స్థానిక గీతా మందిరంలో ఏర్పాటైన సభలో జయంత్‌కుమార్ మాట్లాడుతూ 2011లో క్లబ్ సభ్యుల సంక్షేమార్థం వాసవి కుటుంబ సురక్ష పథకం ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద రూ.50 కోట్లను సంబంధిత కుటుంబాలకు అందజేశామని తెలిపారు. ఎం.సుబ్బారావు, కె.కల్యాణి, ఎ.మురళి, సీహెచ్ రామమోహనరావు, శ్రీనివాసరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.